క్లుప్తంగా

నేడు గురుపౌర్ణమి

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, పాలాభిషేకం తదితర పూజా కార్యాక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం గ్రామంలోని వీధుల్లో సాయి పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీ

సీతంపేట: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర కళాశాలలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎలండ్‌టీ, సీజీఏ గ్రూపుల్లో మిగులు సీట్లలో ప్రవేశాలు కల్పించినట్లు చెప్పారు. బాలికల కళాశాలలో 6, బాలుర కళాశాలలో 37 సీట్లు చొప్పున మొత్తం 43 సీట్లు భర్తీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నాదొర, ప్రిన్సిపాళ్లు పి.సూర్యకుమారి, పి.వి.రామారావు పాల్గొన్నారు.

అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వెలసిన కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయ ఆవరణంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా కోటదుర్గమ్మకు శుక్రవారం శాకంబరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సమర్పించిన వివిధ రకాల కూరగాయలతో అన్న సమారాధనను నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

విరిగిపడిన కొండచరియలు


రహదారిపై విరిగిపడిన కొండచరియలు

సీతంపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీతంపేట మండలంలోని కడగండి వెళ్లే రహదారిపైన కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోడిశ నుంచి కడగండికి వెళ్లే మార్గంలో పక్కనున్న కొండపై నుంచి పెద్దపెద్ద రాళ్లు పడిపోవడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకొనేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు. అర్చకులు శనివారం ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా..పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది చర్యలు చేపట్టారు.


ఐటీఐలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా విద్యార్థులు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈనెల 27న సీతంపేట ఐటీఐలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, కోపా, డ్రెస్‌మేకింగ్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కొమరాడ: మండలంలోని గుణానపురం గ్రామానికి చెందిన కొప్పల పేతరు సారా అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 240 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్

భామిని: మండలంలోని సొలికిరిలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని కాలువల్లో పూడికలు తొలగించి వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించారు. మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ పనులను పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

పంట నీటమునిగితే
ఆందోళన వద్దు

- ముంచెత్తిన ముసురుతో నీట మునిగిన పంటపొలాలు
- సస్యరక్షణతో పంటనష్టం నివారణ
- రైతులకు వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి సూచనలు

పాలకొండ రూరల్/కురుపాం:


కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ ఏడీ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు, కాలువల్లో వరదనీరు చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. పంటపొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారుల హెచ్చరికలతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలో సుమారు 18 వేల హెక్టార్లలో వరి వెదలు వేసుకున్నారు. మరికొన్ని చోట్ల వరినాట్లు పూర్తయ్యాయి. పంట మొలక దశలో ఉన్న సమయంలో నీట మునగడంతో పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు రైతులు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి వివరించారు.


రాజుపేట సమీపంలో పొలంలోని నీటిని బయటకు తరలించేందుకు ఉపక్రమిస్తున్న రైతు

విత్తనం వేసిన 2-3 రోజుల్లో..

విత్తనం వేసిన 2-3 రోజుల వ్యవధిలో ముంపునకు గురైతే మొలక శాతం తగ్గే ప్రమాదం ఉంది. రైతులు తమ మడిలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. దీని వలన విత్తనంకు గాలి తగలటంతో మొలక త్వరగా వస్తుంది. విత్తనం 7-30 రోజుల మధ్య నారు మడిలో 5 రోజుల కంటే ఎక్కువ నీరు నిలిచి ఉంటే నారు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ తరుణంలో నీరు పూర్తిగా బయటకు పోనివ్వాలి. గాలి తగిలేలా


పాలకొండ-భాసూరు పరిశరాల్లో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

చేయాలి. తర్వాత 5 సెంట్లు నారు మడికి 1 కిలో యూరియా, 1 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయటం వలన కొత్త ఆకులు తొగిడి నాట్లు వేయటానికి వీలుంటుంది. తెగుళ్లు అధికంగా ఆశించే క్రమంలో నీరు తీసిన తరువాత మొక్కనిలదొక్కుకున్న క్రమంలో తెగుళ్ల నివారణకు గ్రాము కార్బెండిజిం లేదా మాంకోజెబ్, కార్బెండిజిం మిశ్రం 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పైపాటుగా పిచికారి చేయాలి.

నారుమడుల్లో..

నాట్లు వేసిన మడులు ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు వెళ్లేలా చూడాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా పైపాటుగా వేయటం శ్రేయస్కరం. నీరు పూర్తిగా తీయలేకుంటే ఆకుపై 2 శాతం యూరియా లేదా మూడు 19లు పిచికారీ చేయాలి. వరి నాట్లు పూర్తిగా కోలుకున్న తరువాత సాధారణ, కుళ్లు తెగుళ్లను అధిగమించేందుకు గ్రాము కార్బెండిజిం లేదా మాంకోజెబ్, కార్బెండిజిం మిశ్రమం లీటరు నీటికి 2 గ్రాముల వంతున కలిపి పైపాటుగా పిచికారీ చేయాలి.

వెదపొలాల్లో..

వెదలు జల్లిన వెంటనే వర్షాలు అధికమైతే మొలక శాతం ఘననీయంగా దెబ్బతింటుంది. ఈ క్రమంలో మడిలో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేయాలి. వీలైనంత త్వరగా నీరు బయటకు పోనించి ప్రకృతి గాలికి విత్తనం ఆరేలా చేయాలి. దీనివల్ల మొలక త్వరగా వస్తుంది. విత్తనం వెదలు జల్లి 10-30 రోజులు వ్యవధిలో వర్షాల కారణంగా 5 రోజుల మేరా నీటి ముంపునకు గురేతై నీరు బయటకు పోనిచ్చి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్‌గా పైపాటుగా వేయాలి. నీటి ఉధృతిని కట్టడి చేయలేకుంటే ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా అయినా నీటిని తొలగించే యత్నం చేయాలి. బయటకు కనిపించే ఆకుపై 2 శాతం యూరియా లేదా మూడు 19లు పిచికారి చేయటం వలన పైరు కోలుకుంటుంది. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి కార్బన్‌డిజం, మాంకోజెబ్ 2 గ్రాములు లేదా గ్రాము కార్బన్‌డిజం మిశ్రమాన్ని కలిపి పిచికారి చేయటం వలన ఫలితం ఉంటుంది.


రహదారిపై నిలిచిన వర్షపునీరు తరలింపు పనులు పర్యవేక్షిస్తున్న సీఐ, ఎస్సై

పోలీసుల చొరవ

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద ఉన్న ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షానికి గోతులు ఏర్పడ్డాయి. పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నప్పటికీ సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో శనివారం చినమేరంగి సీఐ మంగరాజు, ఎస్సై చిన్నంనాయుడు దగ్గరుండి గోతులలో ఉన్న నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షేమ వసతిగృహంలో వైద్యశిబిరం నిర్వహించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

జియ్యమ్మవలస: సంక్షేమ వసతి గృహంలో ఆరోగ్య కార్యకర్తలను నియమించి విద్యార్థులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర అన్నారు. రావాడ రామభద్రపురం సంక్షేమ వసతి గృహాన్ని శనివారం పరిశీలించారు. వసతిగృహంలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. వసతిగృహంలో గతంలో నాడు-నేడు కార్యక్రమంలో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు గురైందని గుర్తించారు. సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్ పాడవ్వడంతో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందక రోగాల బారిన పడుతున్నారన్నారు. వసతి గృహంలో 236 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారి ఆరోగ్య


అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

పరిరక్షణకు ఆరోగ్య కార్యకర్తలను నియమించకపోవడాన్ని తప్పుపట్టారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆరోగ్య కార్యకర్తల నియామకం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మణరావు, జిల్లా సహాయ కార్యదర్శి మండంగి రమణ తదితరులున్నారు.

తీర గ్రామాల్లో అప్రమత్తం

పాలకొండ రూరల్: బంగాళాఖాతంతో ఏర్పడ్డ అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారిన నేపథ్యంలో గడిచిన 48 గంటలుగా వర్షాలు కురుస్తున్నాయి. నాగావళి నదిలో పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరుతోంది. తీర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎంపీడీఓ ఎస్.రామ క్రిష్ణ, ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణలతో కూడిన బృందాలు నదితీర ప్రాంతాల్లో పర్యటించాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంపిలి, అన్నవరం, గోపాలపురం, చిన,


అంపిలి వద్ద నాగావళి తీరంలో వరద ఉధృతిని అంచనా వేస్తున్న అధికారులు

గొట్టమంగళాపురం గ్రామాలతో పాటు యరకారాయపురం సచివాయాల సిబ్బందిని అప్రమత్తం చేశారు. వరద ముప్పు గుర్తిస్తే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

పాలకొండ రూరల్: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు అని, ప్లాస్టిక్ నిషేధం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని నవగాం, గోపాలపురం తదితర గ్రామాల్లో కొనసాగుతన్న పరిశుద్ధ్య పక్షోత్సవాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, చిరువ్యాపారులకు ప్లాస్టిక్ సంచుల వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవటంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ అధికారి దశారత్నం, ఈఓపీఆర్డీ కె.సూర్యనారయణ, గ్రామీణ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నరు. అంతకుముందు వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలు, అధికారులు ఆవిష్కరించారు.


గోపాలపురంలో పారిశుద్ధ్య పక్షోత్సవాల కరపత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజలు

చురుగ్గా లెప్రసీ సర్వే


లెప్రసీ సర్వే చేస్తున్న అర్బన్ వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: కుష్టువ్యాధి నివారణ లక్ష్యంగా సమగ్ర సర్వే చేపడుతున్నట్లు అర్బన్ హెల్త్ సెంటర్ ఏపీఎంఒ వి.ప్రసాద్ అన్నారు. పట్టణ పరిధిలో వీవర్స్ కాలనీ, కొత్తవీధి, రెల్లివీధి సమీప ప్రాంతాల్లో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని తెల్లని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకోవచ్చన్నారు. అంగన్వాడీ కార్యకర్త బి.అమరవేణి, ఆశా వర్కర్ కె.గౌరీశ్వరి సర్వేలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి


అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్‌డీ సత్యం

సీతంపేట: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఈవోపీఆర్‌డీ కొండపల్లి సత్యం అన్నారు. పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా సీతంపేటలో శనివారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందకుండా దోమలను నివారించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుదర్శనరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


అంపిలిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు

పాలకొండ రూరల్: ప్రజల భాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధుల నియంత్రణ సాధ్యమని ప్రత్యేకాధికారి డాక్టర్ జగన్మోహనరావు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అన్నవరం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి మండలంలోని అంపిలి గ్రామంలో శనివారం ఇంటింటి సర్వే చేపట్టారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్య సిబ్బంది రాణి, భారతి, కమల, శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కార్యదర్శి నరేష్, సుదీక్ష తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

వీరఘట్టం: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్షణ అని డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు అన్నారు. పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రతపై సీఎఫ్‌లు, డ్వాక్రా సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పించారు. ఆగస్టు 2వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించడం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయడం వంటివి చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ సత్యంనాయుడు

చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం శివున్నాయుడు పాల్గొన్నారు.

అన్నదాతకు అందని సాయం

పాలకొండ: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చెరువులు, కాలువల్లో నీరు చేరింది. సాగునీరు అందుబాటులో ఉండడంతో వరినాట్లు వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ట్రాక్టర్ సాయంతో దమ్ము చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి రైతులకు ఎటువంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పుల కోసం తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు రైతులకు అందిస్తామన్న ఆర్థిక సాయంపై ఎటువంటి ప్రకటన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రైతులకు అవసరమగు ఎరువులు, పురుగు మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

అంతర పంటలతో బహుళ ప్రయోజనాలు

గుమ్మలక్ష్మీపురం: జీడి మామిడి తోటల్లో అంతర పంటల సాగుతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ పి.షన్ముఖరాజు అన్నారు. మండలంలోని జే.కే పాడు, తాటిశీల, రేగులపాడు గ్రామాల్లోని జీడి తోటల్లో రైతులు సాగుచేస్తున్న అంతర పంటలను శనివారం ఆయన పరిశీలించారు. అంతర పంటలుగా కర్రపెండలం, పత్తి, కూరగాయలు, పసుపు, అల్లం సాగు చేయడం వలన అదనపు ఆదాయం సమకూరడమే కాకుండా ప్రధాన పంటైన జీడిమామిడి చెట్లకు సస్యరక్షణ ఉంటుందన్నారు. తద్వారా జీడి దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ అంతర పంటలను సాగు చేసుకుని ప్రయోజనం పొందాలని కోరారు. ఆయన వెంట ఏపీసీఎన్ఎఫ్ మండల కోఆర్డినేటర్ గణేష్ చంద్ర, ఎంటీ జి.నిర్మలాదేవి, క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు ఉన్నారు.


జే.కే.పాడులో జీడిమామిడి తోటల్లో అంతర పంటలను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ పి.షన్ముఖరాజు

పరిశుభ్రతే ప్రధానం

భామిని: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో శనివారం వైద్యాధికారి కె.సంతోషిలక్ష్మి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు, తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం సీహెచ్ఓ భాస్కరరావుతో పాటు వైద్యాధికారి సంతోషిలక్ష్మి గురుకులం వంటశాలను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వంటలను రుచి చూసి పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు విధిగా వేడినీరు అందించాలని సూచించారు. వారి వెంట వైద్య సిబ్బంది, గురుకులం సిబ్బంది ఉన్నారు.


గురుకులంలోని వంటగదిని పరిశీలిస్తున్న వైద్యాధికారి సంతోషిలక్ష్మి, సీహెచ్ఓ భాస్కరరావు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

- రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురంటౌన్: కళాశాలల్లో ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు తప్పవని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్.దామోదరరావు అన్నారు. స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తోటివారిని వేధించడం, అవమానకరంగా మాట్లాడటం చట్టవేతిరేకమన్నారు. తోటివారి హక్కులను కాలరాసేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థినులు, మహిళలు దిశా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు పాడుచేసుకోవద్దని హితవుపలికారు. చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని, చెడు సావాసాలు అలవాటు చేసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు మెడల్స్‌తో సత్కరించారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్యాజాస్మిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, లోక్ అదాలత్ మెంబర్ టి.జోగారావు, కళాశాల ప్రిన్సిపాల్ పెంట అప్పారావు, సీనియర్ లెక్చరర్ వివేకానంద, సిబ్బంది, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి

కురుపాం: మండలంలోని 23 పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై 17వ సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.అప్పారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఏపీఓ బావాజీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం, ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం, ఐటీడీఏ, పంచాయతీరాజ్‌శాఖ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి రూ. 16,96,59,739 లు వేతనాలుగా చెల్లించినట్లు చెప్పారు. మెటీరియల్ వర్క్స్ నిమిత్తం రూ.19,95,20,659లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. నిధుల ఖర్చుకు సంబంధించి సామాజిక తనిఖీ బృందాలకు పూర్తి సమాచారం అందించి, వారికి సహకరించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏపీడీ సురేష్‌నాయుడు, ఎస్ఆర్పీలు దాసు, మాధవరావు, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ సిబ్బంది ఎస్.రవికుమార్, ఈసీ మూర్తి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

ముమ్మరంగా క్లోరినేషన్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ గొడుగూడ, లప్పటి, మూలజమ్ము, లుంబేసు, కప్పలవలస గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను శనివారం శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. సర్పంచ్ తోయక సీతమ్మ ఆధ్వర్యంలో గ్రామ సచివాల య ఉద్యోగులు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.


లప్పటిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం